క్లుప్తంగా

ఆలయాల్లో అన్న సమారాధన



మచిలీపట్నంటౌన్: శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని పలు ఆలయాల్లో ఆదివారం అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలోని శ్రీకన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన అన్న సమారాధన కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమాన్ని ఆలయ భక్త కమిటీ అధ్యక్షకార్యదర్శులు మామిడి మురళీకృష్ణ, ఎంవీ బాబాప్రసాద్, సభ్యులు పర్యవేక్షించారు. రాజుపేటలోని మర్రిచెట్టు రామాలయం, పెద్దవీధి రామాలయం వద్ద శక్తి పటాల నిర్వాహకులు అన్న సమారాధన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని సేకరించారు.

ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవం



కృత్తివెన్ను: ఆర్‌ఎస్‌ఎస్ స్థాపన జరిగి 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదివారం మండలంలోని లక్ష్మీపురంలో శతాబ్ది ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ పులగం సుబ్రమణ్యం, ముఖ్యవక్తగా జిల్లా ప్రచారక్ శ్రీనాథ్ వ్యవహరించారు. దేశ పునర్‌వైభవం కోసం హిందూ సమాజాన్ని సంఘటితం చేస్తూ వ్యక్తినిర్మాణం ద్వారా అహర్నిశలూ కృషి చేస్తున్న రాష్ట్రీయ స్వయం సేవక్ 100 సంవత్సరాలు పూర్తిచేసుకోవడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో బంటుమిల్లి ఖండ కార్యవాహ ఎం.వెంకటరత్నం, పలువురు హిందూ సంఘాల ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో లబ్ధి



గూడూరు: కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ స్లాబ్‌ల వల్ల సాధారణ, మధ్య తరగతికి చెందిన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుతుందని జిల్లా గ్రంథాలయ డెప్యూటీ లైబ్రేరియన్ బీరం వెంకట రమణ అన్నారు. గూడూరు శాఖా గ్రంథాలయంలో ఆదివారం సూపర్ జీఎస్టీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బీరం వెంకట రమణ మాట్లాడుతూ రోజువారీ ఉపయోగించే ఆహార పదార్థాలు, మందులు వంటి వాటిపై జీఎస్టీ పూర్తిగా ఎత్తి వేశారన్నారు. మరికొన్నిటిపై కేవలం 5 శాతం జీఎస్టీ విధించారన్నారు. కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి దాసరి వెంకటరవి, పెనుగొండ శ్రీనివాసరావు, పాఠకులు పాల్గొన్నారు.

సైకిలిస్టును ఢీ కొన్న కారు

పెడన: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుకగా వచ్చిన కారు ఢీ కొనడంతో ఆ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనపై పెడన పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెడన పట్టణంలోని 18వ వార్డుకు చెందిన ఎం.వీరభద్రరరావు (68) శనివారం రాత్రి మచిలీపట్నం నుంచి పెడన తోటమూలకు వచ్చే బైపాస్ రోడ్డు వెంబడి కాలకృత్యాల కోసం సైకిల్‌పై వస్తున్నాడు. అదే సమయంలో మచిలీపట్నం నుంచి బంటుమిల్లి వైపుగా వెళ్తున్న కారు సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుకగా ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన వీరభద్రరరావును స్థానికంగా ఆసుపత్రికి తీసుకువెళ్లగా వారు మచిలీపట్నం తీసుకువెళ్లాలని సూచించారు. మచిలీపట్నం వెళ్లి చికత్స పొందుతున్న వీరభద్రరరావును మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెడన ట్రైనీ ఎస్‌ఐ ఎం.నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేడు నిరసన ప్రదర్శన

మచిలీపట్నంటౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు ఈనెల 13వ తేదీ సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్‌పై జరిగిన అమానుష దాడికి నిరసనగా మచిలీపట్నం కలెక్టరేట్ వద్ద ఉన్న ధర్నా చౌక్ లో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ కృష్ణా జిల్లా ఉపాధ్యక్షుడు జలదంకి నరసింగరావు, చిట్టూరి అర్జునరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ నిరసన కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, సంఘ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై నల్ల జెండాలతో నిరసన తెలపడం జరుగుతుందన్నారు. నిరసన అనంతరం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి వినతి పత్రాన్ని అందజేస్తామన్నారు. కృష్ణా జిల్లాలోని 26 మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

తీరంలో వసతులపై దృష్టి

- హంసలదీవి సాగరతీరంలో వసతులపై అధికారుల దృష్టి
- చురుగ్గా సాగుతున్న కాటేజీ తరహా నిర్మాణాలు
- సేదతీరేందుకు బల్లలు, దుస్తులు మార్చుకొనేందుకు దొడ్లు ఏర్పాటు

సాక్షి స్పందన

కోడూరు: ప్రకృతి రమణీయ దృశ్యాలకు నెలవైన హంసలదీవి సాగరతీరాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ అధికారులు ఎట్టకేలకు ముందుకొచ్చారు. సాగరతీరానికి వచ్చే పర్యాటకుల నుంచి అధికారులు టోల్ వసూలు చేస్తున్నారే గాని అభివృద్ధి చేయడం లేదంటూ సెప్టెంబర్ 17న 'సాక్షి' దినపత్రికలో 'అభివృద్ధి శూన్యం.. దోపిడి ఘనం' శీర్షికతో ప్రత్యేక కథనం ప్రచురితమయింది. కథనానికి స్పందించిన అటవీ ఉన్నతాధికారులు పర్యాటకుల నుంచి వసూలు చేసిన టోల్ నగదుతో అభివృద్ధి పనులు ప్రారంభించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో కళావిహీనంగా మారిన సాగర తీరాన్ని అటవీ అధికారులు సుందరంగా తీర్చిదిద్దే పనిలో నిమగ్నమయ్యారు.



తీరం అందాలు వీక్షించేందుకు వీలుగా కాటేజీ తరహా నిర్మాణాలు



సుందరంగా తీర్చిదిద్దిన కాటేజీ తరహా కట్టడం

తాత్కాలిక కట్టడాలు ప్రారంభం

సముద్ర వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తీరంలో తాత్కాలిక కట్టడాలను ప్రారంభించారు. గోవా తరహాలో సాగరతీరం వద్ద పర్యాటకులు తీరం అందాలు వీక్షించడంతో పాటు సేదతీరేందుకు వీలుగా తాటిబొండెలు, కర్రలతో కాటేజీ తరహా నిర్మాణాలు చేపట్టారు. తీరం ఒడ్డున పర్యాటకులు సేద తీరేందుకు తాటాకు పందిళ్లను ఏర్పాటు చేసి వాటిల్లో కర్రలతో బల్లలను ఏర్పాటు చేశారు. మహిళలు దుస్తులు మార్చుకొనేందుకు వెదురు బొంగులతో మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

పక్కా కట్టడాలకు అనుమతి లేక..

తీరం సీఆర్‌జెడ్ పరిధిలో రావడంతో పక్కా కట్టడాలకు అనుమతి లేకపోవడంతో తాడిబొండులు, కర్రలతో నిర్మాణాలు చేస్తున్నట్లు అటవీ అధికారులు తెలిపారు. పాలకాయతిప్ప కరకట్ట వద్ద నుంచి సముద్రం వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రహదారి పొడవునా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టారు. సాగరతీరంలో అభివృద్ధి పనులు జరగడం పట్ల పర్యాటకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



తాటిబొండెలు, కర్రలతో ఏర్పాటు చేసిన వ్యూ పాయింట్‌లు



పర్యాటకులు సేదతీరేందుకు తాటాకు పందిళ్లు, కర్రలతో బల్లలు



కర్రలతో నిర్మించిన మరగుదొడ్లు

నేడు వైఎస్సార్ సీపీ నిరసన ప్రదర్శన

పెడన: కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని కుటీర పరిశ్రమగా నడిపిస్తుండటాన్ని వ్యతిరేకిస్తూ ప్రభుత్వ వైఖరికి నిరసనగా సోమవారం ఉదయం ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కార్యాలయం ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొంది. వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాము, ఉమ్మడి కృష్ణా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీకి పెడన నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా హాజరుకావాల్సిందిగా కోరింది. ఆ రోజు ఉదయం పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయానికి 9 గంటలకు చేరుకుంటే 9.30 గంటలకు బయల్దేరి పదిన్నర గంటలకు తహసీల్దారుకు వినతి పత్రం అందజేస్తారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ కుటుంబ శ్రేణులంతా తప్పనిసరిగా హాజరై జయప్రదం చేయాల్సిందిగా పార్టీ కార్యాలయం పేర్కొంది.

జీఎస్టీపై అవగాహనకు నోడల్ అధికారుల నియామకం

పెడన: సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించేందుకు వార్డు సచివాలయాలకు చెందిన ఉద్యోగులను నోడల్ అధికారులుగా నియమిస్తూ మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 13, 14, 15వ తేదీలలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. 13న దుకాణాలు, జీమ్‌సెంటర్లు, యోగా సెంటర్లలో కరపత్రాలను అందజేసి అవగాహన కల్పించాలన్నారు. 14న ప్రముఖ ఆర్థిక వేత్తలతో పాటు వ్యాపారులతో సెమినార్లు ఏర్పాటు చేయాలని, 15న బిల్డర్లు, నిర్మాణ సామగ్రి సరఫరాదారుల కోసం ప్రదర్శనలు ఏర్పాటు చేసి జీఎస్టీపై తగ్గింపు గురించి తెలియజేయాలని ఆ ఉత్తర్వులలో సూచించారు. ఆయా కార్యక్రమాలను తప్పనిసరిగా నిర్వహించి ఫొటోల నివేదికలు అందజేయాలని, లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

మాజీ కౌన్సిలర్ వెంకటేశ్వర్లు మృతి

నివాళులర్పించిన పేర్ని నాని

మచిలీపట్నం టౌన్: వైఎస్సార్ సీపీకి చెందిన మాజీ కౌన్సిలర్ భోగిరెడ్డి వెంకటేశ్వర్లు (59) ఆదివారం తెల్లవారు జామున మృతి చెందారు. అనారోగ్యంతో గత కొంతకాలంగా బాధ పడుతున్న ఆయన మృతి చెందడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 2000- 2005 సంవత్సరాల మధ్య ఆయన నగరంలోని అప్పటి 24వ వార్డు కాంగ్రెస్ కౌన్సిలర్‌గా పని చేశారు. ఆ తర్వాత వైఎస్సార్ సీపీలో చేరారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య భోగిరెడ్డి బేబీ కూడా కౌన్సిలర్‌గా పనిచేశారు. నగరంలోని సాకిరేవుపాలెంలోని ఆయన నివాసం వద్ద ఉన్న వెంకటేశ్వర్లు మృతదేహాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) సందర్శించి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. వెంకటేశ్వర్లు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించిన వారిలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు షేక్ సలార్ దాదా, ఎం.వి బాబాప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, మాజీ డెప్యూటీ మేయర్ లంక సూరిబాబు, కార్పొరేటర్లు మేకల సుబ్బన్న, తిరుమలశెట్టి వరప్రసాద్, దింటకుర్తి సుధాకర్, కో ఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, మాజీ కౌన్సిలర్లు చిటికెన నాగేశ్వరరావు, తుమ్మలపల్లి జగన్నాథం తదితరులు ఉన్నారు. సాయంత్రం జరిగిన వెంకటేశ్వర్లు అంతిమయాత్రలో పేర్ని నాని పాల్గొని శవ పేటికను మోశారు. ఈ అంతిమయాత్రలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వెంకటేశ్వర్లు సేవపేటికను మోస్తున్న పేర్ని నాని (ఇన్‌సెట్లో) భోగిరెడ్డి వెంకటేశ్వర్లు

పర్యావరణ పరిరక్షణ బాధ్యత అందరిదీ



ఘంటసాలపాలెం(ఘంటసాల): పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ వై.బింధ్య అన్నారు. మండలంలోని ఘంటసాలపాలెం గ్రామంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని సామాజిక విజ్ఞాన కళాశాల విద్యార్థినులు జాతీయ సేవా పథకంలో భాగంగా 5వ రోజు ఆదివారం గ్రామంలోని ప్రధాన కూడళ్లు, ప్రాంతాల్లో వాల్ పెయింటింగ్స్ ద్వారా ప్రజలకు ప్లాస్టిక్ తగ్గించడం, పునర్వినియోగంపై సాధ్యమైన మార్గాలను వివరించారు. విద్యార్థినులు ఘంటసాల పాలెం బస్టాండ్ వద్ద, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో గోడలపై సందేశాత్మకమైన చిత్రాలను వేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పేర్ని నాని విస్తృత పర్యటన

చిలకలపూడి(మచిలీపట్నం): మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకట్రామయ్య (నాని) పర్యటించారు. ముందుగా మండల పరిధిలోని కొత్తపూడి గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించి ప్రారంభించిన చర్చిని ఆయన సందర్శించారు. చర్చిలో నిర్వహించిన ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆ గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి గోకవరం పంచాయతీ పరిధిలోని రెడ్డిపాలెం గ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించిన గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. పేర్ని నాని వెంట వైఎస్సార్ సీపీ నాయకులు పిప్పళ్ల నాగబాబు, పరింకాయల అశోక్, గాజుల నాగరాజు, వన్నెంరెడ్డి రామకృష్ణ తదితరులు ఉన్నారు.



చర్చిలో ప్రార్థనలో పాల్గొన్న పేర్ని నాని తదితరులు

ఎట్టకేలకు పిచ్చి మొక్కల తొలగింపు



నాడు: పిచ్చి మొక్కలతో నిండిపోయిన కమిషనర్ బంగ్లా



నేడు: శుభ్రం చేసిన తర్వాత కమిషనర్ బంగ్లా

సాక్షి స్పందన

మచిలీపట్నంటౌన్: నగరంలోని నిర్మల కాన్వెంట్ ముందున్న మున్సిపల్ కమిషనర్ బంగ్లా ఆవరణను శుభ్రం చేశారు. గత కొన్ని ఏళ్లుగా ఈ బంగ్లాను వినియోగించకుండా నిరుపయోగంగా ఉంచారు. దీంతో భవనం ఆవరణ పిచ్చి మొక్కలతో నిండి పోయింది. నగరం నడిబొడ్డున ఉన్న విలువైన ఈ భవనాన్ని వినియోగించకుండా నిరుపయంగా ఉంచడంపై నగర ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో సాక్షిలో సెప్టెంబర్ 14వ తేదీన 'నిరుపయోగంగా అధికారుల బంగ్లాలు' శీర్షిక వార్త ప్రచురితమైంది. దీనికి స్పందించిన నగర పాలక సంస్థ అధికారులు ఎట్టకేలకు కమిషనర్ బంగ్లా వద్ద ఉన్న ముళ్ల కంపని తొలగించి శుభ్రం చేశారు. అలాగే ఆ ప్రాంతంలోని ఎంఈ, టీపీవో బంగ్లాల స్థలంతో పాటు అక్కడి ఖాళీ స్థలంలో ఉన్న దట్టమైన పిచ్చి మొక్కలను తొలగించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. దాదాపు ఆరెకరం స్థలంలో పిచ్చి మొక్కలు పెరగడంతో విష సర్పాలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వారు వాపోతున్నారు.

వైద్య శిబిరాల్లో కంటి పరీక్షలు

నాగాయలంక: జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆసుపత్రి (పెదకాకాని) సహకారంతో దివంగత తలశిల శ్రీరాములు, ఉప్పల వెంకయ్య, కనిగంటి అంకినీడుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల ఆర్థిక సౌజన్యంతో స్థానిక సుదర్శి మానవతా సంస్థ ఆధ్వర్యంలో 57వ ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. ఆదివారం స్థానిక డిజిటల్ స్కూలు ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో 90 మందికి డాక్టర్ శ్యామ్‌దీప్ కంటి పరీక్షలు జరిపారు. వీరిలో 65 మందిని ఐఓఎల్ ఆపరేషన్ (కంటి లోపల అద్దం అమరిక)లకు ఎంపిక చేశారు. సంస్థ నిర్వాహకులు తలశిల రఘుశేఖర్, కనిగంటి వెంకట నారాయణ, ఆసుపత్రి క్యాంప్ ఇన్‌చార్జి రవి పర్యవేక్షణలో ఉచిత శస్త్ర చికిత్స కోసం ప్రత్యేక బస్సులో శంకర కంటి ఆసుపత్రికి పంపించారు. తలశిల లీలా మనోహర్, మత్తి శివ, కనిగంటి అజయ్ తదితరులు శిబిరంలో వృద్ధులకు సేవలు అందించారు.

200 మందికి వైద్య పరీక్షలు

మచిలీపట్నంటౌన్: విజ్ఞానవేత్త, భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక సన్ స్టార్ స్కూల్ ప్రాంగణంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. హ్యూమానిటీ ఫౌండేషన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కంటి చూపు సమస్యలతో బాధపడుతున్న 200 మందికి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి నేత్ర వైద్య నిపుణుడు, జిల్లా అంధత్వ నివారణాధికారి డాక్టర్ జీ భానుమూర్తి ఉచిత నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు, కళ్లజోళ్లు ఉచితంగా పంపిణీ చేశారు. కంటికి శస్త్రచికిత్స అవసరమైనవారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు డాక్టర్ భానుమూర్తి తెలిపారు. చిన్నారి హర్షవర్ధన్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.10 వేలను మానవత స్వచ్ఛంద సంస్థ సభ్యులు శ్రీరామ్ అందజేశారు. ఈ కార్యక్రమాన్ని హ్యూమానిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నూర్జహాన్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృష్ణా జిల్లా విద్యానిధి కన్వీనర్ పి.శ్రీరామ్, కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సల్మాబేగం సేవా సంస్థ ప్రెసిడెంట్ జీ కిషోర్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ బొమ్మిడి అయ్యప్ప స్వామి, సభ్యులు అజమతున్నిసా, హుస్సేన్, స్టార్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.ఎల్ ఆదిత్య పర్యవేక్షించారు.

కంటి ఆపరేషన్లకు 28 మంది ఎంపిక

చల్లపల్లి: స్థానిక వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆ కార్యాలయ ఆవరణలోఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 80 మందిని పరీక్షించి వారిలో 28 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికచేశారు. ఎంపిక చేసిన వారికి విజయవాడలోని అమరావతి కంటి ఆసుపత్రిలో ఐఓఎల్ ఆపరేషన్లు చేయించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్యులు బి.మోహనరావు, వాసవి క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాజేటి అమరవాణి, గోళ్ళ వెంకటరత్నం, చల్లపల్లి సీహెచ్‌సీ డైరెక్టర్ వరద హరిగోపాల్, వాసవీ క్లబ్ సభ్యులు కొల్లిపర నరేంద్ర, వరద రాజశేఖర్, ఉరిమి రమేష్, మలిశెట్టి చెంచురాములు, సువర్చల, జ్యోతి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.



నాగాయలంకలో నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు, సిబ్బంది



మచిలీపట్నంలో రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యుడు భానుమూర్తి



చల్లపల్లిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు మోహనరావు

ఘనంగా హజ్రత్ నిర్గన్‌షా ఔలియా దర్గాలో గ్యార్మీ వేడుకలు

గూడూరు: స్థానిక పటాన్‌పేటలో ప్రసిద్ధి చెందిన హజ్రత్ నిర్గన్‌షా ఔలియా దర్గాలో గ్యార్మీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. దర్గా కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ యాసీన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలలో మతగురువులు మౌలానా జునైద్ రజా హజ్రత్ గౌసె ఆజం దస్తగీర్ జీవిత చరిత్ర పుస్తక పఠనం నిర్వహించారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వేర్వేరుగా దర్గాకు వచ్చిన పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్, గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, బాబా సమాధికి దట్టీ సమర్పించి ప్రార్థనలు నిర్వహించారు. డీసీ చైర్మన్ పోతన స్వామి, గోపి నాగబాబు, బాసంశెట్టి విజ య్, బొర్రా శ్రీను, తోట వేణు, మొహమ్మద్ అయూ బ్, అబ్దుల్ అలీం, నియాజీ, మొహ్మద్ ఆలి పాల్గొన్నారు.



దర్గాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే తదితరులు

నేడు శివయ్యకు శమీ పత్రార్చన

నాగాయలంక: స్థానిక శ్రీరామ పాదక్షేత్రం ఘాట్‌లోని శ్రీగంగ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి మండపంలోని స్వామివారి శివలింగానికి సోమవారం శమీ పత్రాలతో భక్తులచే మహా అర్చన నిర్వహిస్తున్నట్లు క్షేత్రం కమిటీ ప్రతినిధి ఉప్పల లీలాకృష్ణ ప్రసాద్ (బుజ్జి), అర్చకుడు అంబా సాయికిరణ్ శర్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి వారి జన్మ నక్షత్రం ఆర్ద్ర విశిష్టత పురస్కరించుకుని 6.30 గంటలకు శివునికి ప్రీతిపాత్రమైన శమీవృక్ష ఆకులతో భక్తులచే విశేష అర్చన నిర్వహిస్తారు.

కొండలమ్మ సన్నిధిలో భక్తుల కోలాహలం

గుడ్లవల్లేరు: శ్రీ కొండలమ్మ అమ్మవారి సన్నిధి ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. భక్తులు పాల పొంగళ్లు పొంగించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు పర్యవేక్షించారు.

అమ్మవారిని దర్శించుకున్న సినీ నిర్మాత అమర్

మండలంలోని వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని చిరంజీవి క్రియేషన్స్ అధినేత, ధర్మ కార్య సంస్థ ప్రతినిధి చల్లపల్లి అమర్ ప్రసాద్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయాధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహనరావు అమర్‌ను శేష వస్త్రంతో సన్మానించి.. అమ్మవారి లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

గుడివాడరూరల్: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీషీటర్లకు గుడివాడ తాలూకా ఎస్‌ఐ ఎస్.చంటిబాబు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న రౌడీషీటర్లు, చెడునడత ఉన్న వ్యక్తులు నేరాలను వదిలి స్వేచ్ఛగా జీవించాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాల సమాచారం ఇవ్వాలన్నారు. అనుమానిత వ్యక్తులపై నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ట్రైనీ ఎస్‌ఐ లోకేశ్వరి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ రైతులకు సత్కారం

పామర్రు: రైతుల దినోత్సవం సందర్భంగా పామర్రు సెంటర్‌లో ఘంటసాల కళాపీఠం ఆధ్వర్యాన ఆదివారం రైతులను సత్కరించారు. కళాపీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీకృష్ణ కళాపీఠం ఆధ్వర్యంలో మండలంలోని ఆరుగురు ఉత్తమ రైతులను సన్మానించారు. భీమవరపు శ్రీనివాసరెడ్డి, కళాపీఠం కార్యదర్శి నందిపాటి హేమంత్‌రెడ్డి పాల్గొన్నారు.

చేనేత సొసైటీ ప్రారంభం

గూడూరు: చేనేత రంగానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని రాయవరం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన లక్ష్మీ హ్యాండ్లూమ్ వీవర్స్ కో ఆపరేటివ్ సొసైటీని ఎమ్మెల్యే చేతుల మీదుగా ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాగిత మాట్లాడుతూ చేనేత కార్మికులు ఆర్థికంగా స్థిరపడటానికి సహకార సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో చేనేత సహకార సంఘం ప్రతినిధులు, చేనేత కార్మికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కుంతీదేవికి ప్రత్యేక పూజలు

చిలకలపూడి(ఘంటసాల): మండలంలోని చిలకలపూడి గ్రామంలోని ఎస్సీ కాలనీలో కుంతీదేవి పండుగ ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా అమ్మ వారిని కనకపర్తి శ్రీనివాసరావు, దివి ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, కర్రా సుధాకర్, మేడికొండ విజయ్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ, పెద్దల శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బాలు, కె.నాగరాజు, నాగమల్లేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.